పోదును''

''మరి''

''నేననుకున్న స్థాయిలో నువ్వు ప్రేమించటం లేదన్న సంగతి రాత్రే తెలిసింది''

''ఎలా తెలిసిందో'' కోపంగా అన్నాడు.

''బస్సులో సంఘటన గుర్తు చేసుకో''

నంద్యాలకు రాత్రి పదకొండు గంటలకు వచ్చింది తిరుపతి వెళ్ళే బస్సు. అంతవరకూ భయం భయంగా బస్టాండులో ఓ మూల కూర్చుని వున్న రమ్యా కిరణ్ బస్సు ఎక్కారు. బస్సు రష్‌గా లేకపోవటంతో ఇద్దరికీ టూ సీటర్ దొరికింది.

బస్సు బయలు దేరింది. లైట్లు ఆర్పేశాడు డ్రైవరు. బస్సంతా చీకటి. తాను చేయబోతున్న సాహసానికి ఒక వైపు భయం, మరో వైపు ఏదో ఆనందం కమ్మివేశాయి రమ్యను. పెద్దలను కాదని వెళుతూ వుండటం వల్ల తరువాత పరిణామాలు ఎలావుంటాయో అన్న ఆందోళనా వుంది ఆమెలో. కిరణ్ స్థితి కూడా అలాగే వుంది.

నిద్ర రాకున్నా అలసటగా కిరణ్ ఒళ్ళో వాలి పడుకుంది రమ్య. ఆలోచనలతో సిగరెట్లు తగలేస్తున్నాడు కిరణ్.

కడప దాటింది బస్సు. సరిగ్గా రెండు కావస్తోంది. రమ్య కిరణ్ తప్ప మిగిలిన అందరూ నిద్రపోతున్నారు. బస్సు ఇంజెన్ రొద. చుట్టూ చీకటి. పాకెట్‌లోని ఆఖరి సిగరెట్ వెలిగించాడు కిరణ్.

''స్ స్ స్'' అంటూ ఏదో శబ్దం ఇంతలో ఏదో గ్యాస్ లీక్ అవుతున్నట్టు వుంది శబ్దం.

ఆ శబ్దం ఏమిటో అర్థంకాలేదు కిరణ్‌కు.

''హోల్డాన్'' ముందరి సీట్లలో కూర్చున్న ఎవరో అరిచారు. బ్రేక్ వేశాడు డ్రైవరు. ఆ అరుపుతో బస్సులోని అందరూ మేల్కొన్నారు.

''సిగరెట్లు పారెయ్యండి గ్యాస్ లీక్ అవుతోంది'' అదే కంఠం అరిచింది. ఏమిటో అర్థంకాక సిగరెట్ పారేశాడు కిరణ్.

బస్సు ఆపాడు డ్రైవరు. అంతా గోలగోలగా తయారైంది.

''సిలిండర్ పేలిపోతుంది దిగండి'' అరుస్తూ బస్సు దిగాడు ఓ వ్యక్తి. అతని వెనుకే గొర్రెల మందలా అందరూ ప్రాణ భయంతో దిగటానికి తోసుకోసాగారు.

''స్ స్'' అన్న శబ్దం మరింత ఎక్కువైంది.

రమ్య కిరణ్ కూడ జనాన్ని తోసుకుంటూ అతి కష్టం మీద బస్సు దిగారు.

అందరూ బస్సుకు దూరంగా పరుగెత్తారు. మరో క్షణంలో బస్సు పేలిపోతుందన్న భయం అందరిలో.

''అసలు గ్యాస్ సిలెండర్ బస్సులో ఎందుకేశారు'' అంటూ కండక్టరు మీదకు కొట్లాటకు దిగారు కొందరు. అతను ఏదో చెప్పబోయాడు కాని ఎవ్వరూ వినిపించుకోలేదు.

అడవి మధ్య చీకట్లో ఏ క్షణం బస్సు పేలుతుందో అన్న భయంతో నిలబడ్డారు అందరూ.

పది నిముషాలు గడిచాయి. బస్సు పేలలేదు.

అప్పుడు బయట పెట్టాడు కండక్టరు అసలు విషయం. అది వంట గ్యాసు సిలిండరు కాదు సోడా గ్యాసు సిలిండరు అని.

''మరా విషయం ముందే ఎందుకు చెప్పలేదు'' ఎవరో అడిగారు.

''మీ గోల మీదేకాని నన్నెక్కడ చెప్పనిచ్చారు''

''నవ్వుకుంటూ అందరూ బస్సెక్కారు. ఆరు గంటలకు తిరుపతి చేరుకుంది బస్సు.

''దానికీ మన పెళ్ళికీ ఏమిటీ సంబంధం'' అడిగాడు కిరణ్.

''చాలా వుంది బస్సు పేలి పోతుందన్న భయంతో ఒకర్నొకరు తోసు కుంటూ అందరూ దిగారు. మనమూ దిగాం. కాని ముందు ఎవరు దిగారో గుర్తుందా''

''ఏమో ఆ తొక్కిసలాటలో గుర్తు లేదు''

''నాకు బాగా గుర్తుంది. ముందు నువ్వే దిగావు. ప్రక్కన వున్న నన్ను మరచి ప్రాణ భయంతో నువ్వు దిగేశావు అప్పుడే తీసుకున్నా నీ నిర్ణయం''

''ఇంత చిన్న విషయానికి''

''ఇది చిన్న విషయం కాదు కిరణ్'' తీవ్రంగా అంది రమ్య.

''నిన్ను ప్రాణం కన్నా ఎక్కువగా ప్రేమించాను అనేవాడివి. కాని నువ్వలా చెయ్యలేదు. దానికి కారణం అందరికన్నా ఎక్కువగా నిన్ను నువ్వే ప్రేమించుకుంటున్నావు''

''రమ్యా'! ఏదో చెప్పబోయాడు కిరణ్.

''వద్దు కిరణ్ ఏం చెప్పకు. నాక్కావలసింది తనకన్నా నన్ను ఎక్కువగా ప్రేమించే మనిషి. వస్తాను'' అని తన బ్యాగ్ తీసుకుని కదలి పోయింది రమ్య.

వెళ్ళిపోతున్న ఆమెను తెల్లబోయి చూస్తుండి పోయాడు కిరణ్.

## కాలమ్ దాటని కథ

వెనుకటి కాలంలో జమీందారులు పంటమీద పన్నువేసేవారు, పుట్టికి ఇరస ధాన్యం చొప్పున! వారి జవానులు ఆ ధాన్యం తీసుకుపోయి తాణాకు చేర్చేవారు. కొందరు జవానులు, పండకపోయినా, ఎక్కువ పండిందని దబాయించి, ఎక్కువ వసూలు చేసుకుపోయేవారు జబర్దస్తీతో. అల్లా ఇవ్వని వాళ్లకు బండకొయ్యలు కూడా వేసేవారు.

భూములను అమ్ముకోలేక, అవి పండక పోయినా, ఆ శిస్తు చెల్లిస్తూ, మంగళ సూత్రాలను అమ్ముకొని, పసుపు కొమ్ములో, కొయ్య పుస్తెలో కట్టుకుని కాలక్షేపం చేసేవాళ్లు ఆడవాళ్లు. ఆ కష్టాలు రెండు మూడు సంవత్సరాలు అనుభవించి, జమీందారుతో మొత్తుకుంటే, ఒక గ్రామానికి స్వయంగా విచారణకు వచ్చాడు జమీందారు. దైవికంగా అది పండిన సంవత్సరం అయింది. ఒక రైతును ఎల్లా పండిందని అడిగాడు. అతడు సంతోషంతో

''దుబ్బువాటెడు - వెన్నుమూరెడు - వెన్నుకు దోసెడు'' అని, ఇంకా ఏమేమో




చెప్పబోతూ ఉంటే, ఇంకొక రైతు అతని వంక తీక్షణంగా చూశాడు. అప్పటికి వాడు ప్రమాదం గుర్తించాడు. ''కాని,'' అని, ఊరుకున్నాడు.

''చెప్పండి'' అన్నాడు జమీందారు. ''ఉప్పని ఊదితే, హూష్ కాకి!'' అని, చదికిల పడ్డాడు. ''అంతా, తాలు వేసి పోయిందన్న మాట!'' అని, జమీందారు విచారపడ్డాడు. ''చిత్తం చిత్తం!'' అన్నారు, వెంటనే రైతు లందరూ. ''ఈయేటికి శిస్తు మాఫీ!'' అని, వెళ్ళిపోయాడు జమీందారు. ఆ పంటతో రైతులు వెనుకటి బాకీలు తీర్చుకున్నారు.

—పైడిపాటి సుబ్బరామశాస్త్రి